ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్
1
RNI No: APTEL/2023/87888
గురువారం
11 డిసెంబర్ 2025

మీకు నోబెల్ రాదంటూ ట్రంప్ పై విమర్శలు..

అమెరికాలో మోదీ-పుతిన్ సెల్ఫీ వైరల్

డిసెంబర్ 11, (రిపబ్లిక్ న్యూస్): రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత పర్యటన.. అమెరికా ప్రభుత్వంపై తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఆ పర్యటన భారత ప్రధాని మోదీ-పుతిన్ల మధ్య స్నేహబంధాన్ని మరోసారి వెల్లడి చేసింది. పుతిన్ భారత్‌లో దిగగానే మోదీ ఆయనకు స్వాగతం పలికి కారులో కలిసి వస్తున్నప్పుడు తీసుకున్న సెల్ఫీ వైరల్ అయింది. ఇప్పుడు అదే ఫొటో అమెరికా రాజకీయాల్లో కలకలం రేపుతోంది.ఒక్క చిత్రం ఎన్నో అర్థాల్ని వెల్లడి చేస్తోందని అగ్రరాజ్య చట్టసభ సభ్యురాలు సిడ్నీ కమ్లాగర్ డువ్ హెచ్చరించారు. భారతపై ట్రంప్ యంత్రాంగం వైఖరిని ఆమె ప్రశ్నించారు.

ట్రంప్ విధానాలు ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక విశ్వాసం, పరస్పర అవగాహనను దెబ్బతీస్తోందని మండిపడ్డారు. అవి అమెరికాకే హాని చేస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. "అమెరికా వ్యూహాత్మక భాగస్వాములను శత్రువుల చేతిలోకి నెట్టడం ద్వారా మీకు నోబెల్ రాదు" అని ట్రంప్ను ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా వాషింగ్టన్ మేల్కొనాలని సెల్ఫీని ఉద్దేశించి ఆమె పిలుపునిచ్చారు. 2022లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత పుతిన్ భారత్ పర్యటనకు రావడం ఇదే తొలిసారి. ఢిల్లీలోని పాలం విమానాశ్రయంలో దిగగానే రెడ్ కార్పెట్ స్వాగతం లభించింది. ఆయన్ను మోదీ ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. ఇద్దరూ తమ కాన్వాయ్లను వదిలి, టయోటా ఫార్చ్యూనర్లో ప్రధాని అధికారిక నివాసం వరకు కలిసి ప్రయాణించడం చర్చనీయాంశమైంది. "ఆ కారు రైడ్ నా ఆలోచన. మా స్నేహానికి చిహ్నం. ఆ సమయంలో మేం మాట్లాడుతూనే ఉన్నాం. చర్చించుకోవడానికి ఎప్పుడూ ఏదోఒక అంశం ఉంటుంది" అని ఆ రైడ్ గురించి పుతిన్ పేర్కొన్న సంగతి తెలిసిందే. రష్యా చమురు కొనుగోలు చేస్తోన్న భారత్ పై అమెరికా భారీగా సుంకాలు విధించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. అమెరికా వ్యవహార శైలి.. భారత్ను రష్యా వైపునకు నెట్టివేస్తోందని సిడ్నీ విమర్శించారు.

మాచర్ల కోర్టులో లొంగిపోయిన పిన్నెల్లి సోదరులు

మాచర్ల, డిసెంబర్ 11, (రిపబ్లిక్ న్యూస్): వైకాపా నేత, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి కోర్టులో లొంగిపోయారు. గురువారం ఉదయం పల్నాడు జిల్లా మాచర్లలోని జూనియర్ అదనపు సివిల్ జడ్జి కోర్టుకు వారిద్దరూ వచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోస్తు ఏర్పాటు చేశారు.

వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన తెదేపా నాయకులు, సోదరులైన జవ్విశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావులు మే 24న హత్యకు గురయ్యారు. గ్రామంలో ఆధిపత్య పోరును తమకు అనుకూలంగా మలచుకొని జంట హత్యలకు పరోక్షంగా సహకరించారని పోలీసులు పిన్నెల్లి సోదరులను ఏ6, ఏ7గా చేర్చి కేసు నమోదు చేశారు. ఈ కేసులో వారు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్ను కింది కోర్టు, హైకోర్టు రద్దు చేయగా.. సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అక్కడ కూడా బెయిల్ పిటిషన్ రద్దయింది. రెండు వారాల్లో లొంగిపోవాలని గత వారం సుప్రీంకోర్టు సూచించింది. దీంతో పిన్నెల్లి సోదరులిద్దరూ నేడు కోర్టులో లొంగిపోయారు.

తొలి విడత పోలింగ్.. పలుచోట్ల స్వల్ప ఘర్షణలు

డిసెంబర్ 11, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణ వ్యాప్తంగా తొలి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివస్తున్నారు. దీంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 9 గంటల వరకు 19.58 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఉపాధి కోసం నగరాలు, పట్టణాల్లో ఉన్న ఓటర్లు స్వస్థలాలకు చేరుకుంటున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. వెబ్కాస్టింగ్ ద్వారా పోలింగ్ను అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

కంచర్ల భూపాల్ రెడ్డి- గుత్తా అమిత్ రెడ్డి మాటల యుద్ధం

పంచాయతీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పలుచోట్ల స్వల్ప ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. నల్గొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో కాంగ్రెస్, భారత రాష్ట్రసమితి నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్రెడ్డి, డెయిరీ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్రెడ్డి మధ్య మాటల యుద్ధం జరిగింది. ఇరువర్గాలను పోలీసుల చెదరగొట్టారు. కేతేపల్లి మండలం కొర్లపహాడ్లో రాళ్లు, కత్తులతో ఇరువర్గాలు పరస్పరం దాడులకు దిగాయి. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. వారిని ఆస్పత్రికి తరలించారు. దీంతో గ్రామంలో భారీగా పోలీసులు మోహరించారు.

అభ్యర్థి గుర్తు లేకపోవడంతో నిలిచిన పోలింగ్..

నాగర్కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కుప్పగండ్ల పదోవార్డులో పోలింగ్ కాసేపు నిలిచిపోయింది. బ్యాలెట్ పేపర్పై వార్డు అభ్యర్థి దేరాంగుల యాదమ్మకు గుర్తు కేటాయించకపోవడంతో అధికారులు పోలింగ్ను నిలిపివేశారు. అరగంట తర్వాత వేరే బ్యాలెట్ పేపర్లు తీసువచ్చి పోలింగ్ను కొనసాగించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పాలమాకుల పోలింగ్ కేంద్రం వద్ద వృద్ధులు, దివ్యాంగులు అవస్థలు పడుతున్నారు. వీల్చైర్లు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. కుటుంబసభ్యులు వారిని చేతులపై మోసుకుంటూ వెళ్లి ఓటు వేయిస్తున్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

ఓటీటీలోకి అల్లరి నరేశ్ కొత్త సినిమా.. 12ఏ రైల్వే కాలనీ స్ట్రీమింగ్ ఎక్కడంటే!

అల్లరి నరేశ్, కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం '12ఏ రైల్వే కాలనీ'. నవంబర్ 21న ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా ఇప్పుడు సడన్గా ఓటీటీలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. నాని కాసరగడ్డ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సాయికుమార్, గెటప్ శ్రీను, వైవా హర్ష తదితరులు నటించారు. కథేంటంటే..:కార్తీక్ (అల్లరి నరేశ్) అనాథ. వరంగల్లోని రైల్వేకాలనీలో ఫ్రెండ్స్తో కలిసి జీవిస్తుంటాడు. లోకల్ రాజకీయ నాయకుడు టిల్లు (జీవన్)కి తను నమ్మిన బంటు. గత రెండు ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిన టిల్లు.. ఈసారి ఎలాగైనా పదవిలోకి రావాలని లక్ష్యంగా పెట్టుకుంటాడు. ఆ ఎన్నికల ప్రచార కార్యక్రమాలకు సంబంధించిన ఓ బాధ్యతను కార్తీక్ భుజాన పెడతాడు. దానిలోభాగంగా యువతను ఆకర్షించేందుకు కార్తీక్ ఓ ఆటల పోటీ నిర్వహిస్తాడు. ఆ పోటీల్లోనే ఆరాధన (కామాక్షి భాస్కర్ల)ను చూసి మనసు పారేసుకుంటాడు. మరి ఆ తర్వాత ఏం జరిగింది? అసలు ఆరాధన ఎవరు? ఆమె నేపథ్యమేంటి? ఆరాధన తన భార్యంటూ కథలోకి వచ్చిన జయదేవ్ షిండే (అనీష్ కురువిల్లా)కి, హత్యకు ఏమైనా సంబంధం ఉందా? తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్థాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

రిపబ్లిక్ స్పోర్ట్స్

అతడు చాలా హార్డ్ వర్కర్:యశస్వి జైస్వాల్

జట్టులో శుభ్మన్ చాలా హార్డ్వర్కర్ అని టీం ఇండియా యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ కొనియాడాడు. ఇంగ్లాండ్ జరిగిన టెస్ట్ సిరీస్లో అద్భుత పోరాట పటిమను ప్రదర్శించాడని ప్రశంసించాడు. ఫిట్నెస్ మీద కూడా శ్రద్ధ పెడతాడన్నాడు.'నేను ఇటీవల కొంతకాలంగా శుభ్మనిల్ను చాలా దగ్గరగా పరిశీలిస్తున్నాను. అతడు చాలా హార్డ్వర్క్ చేస్తాడు. తన దైనందిన కార్యక్రమాల్లో క్రమశిక్షణ ప్రదర్శిస్తాడు. అతడు తన ఫిట్నెస్ మీద చాలా శ్రద్ధగా ఉంటాడు. ఆహారం, నైపుణ్యం పెంచుకోవడం, శిక్షణ విషయంలో అస్సలు రాజీ పడడు. అతడితో కలిసి ఆడటాన్ని నేను ఆస్వాదించా. మొత్తానికి అతడో అద్భుతమైన వ్యక్తి' అని యశస్వి జైస్వాల్ అన్నాడు. 'అలాగే అతడు ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్లో చక్కగా, సమయోచితంగా బ్యాటింగ్ చేశాడు. అతడు విపత్కర పరిస్థితుల్లోనూ చక్కగా రాణిస్తాడని మేమంతా నమ్మాం' అని జైస్వాల్ వివరించాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన మూడు వన్డేల సిరీస్లో జైస్వాల్ మొదటి రెండు మ్యాచుల్లో పెద్దగా పరుగులు చేయలేదు. రాంచీలో 18, రాయపూర్లో 22 రన్స్ మాత్రమే చేశాడు. కానీ సిరీస్ విజేతను నిర్ణయించే కీలకమైన విశాఖపట్నం వన్డేలో సెంచరీ చేసి తన సత్తా చాటాడు. 116 పరుగులతో నాటౌట్గా నిలిచాడు. దీంతో టీమ్ ఇండియా 271 పరుగుల లక్ష్యాన్ని 39.5 ఓవర్లలోనే చేధించగలిగింది. దీంతో వన్డే సిరీస్ను టీమ్ ఇండియా 2-1 తేడాతో కైవసం చేసుకుంది. కెప్టెన్ శుభ్మన్ గిల్, వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ గాయాలతో దూరమవడంతో జైస్వాల్కు వన్డే జట్టులో చోటు దక్కిన విషయం తెలిసిందే.

ఇంటిచిట్కాలు

పండుగలు, శుభాకార్యాలు.. ఇలా ఏ వేడుకైనా సరే చేతుల నిండుగా మెహందీ వేసుకుంటారు. దీంతోనే చేతులకి అసలైన కళ వస్తుంది. అకేషన్స్ తర్వాత మెహందీ మొత్తం పోవడానికి టైమ్ పడుతుంది. కానీ, ఆలోపు ఆఫీసులో పంచ్ చేయడానికి, లేదా కొన్ని కాలేజెస్, స్కూల్స్లో మెహందీని అలో చేయరు. అలాంటప్పుడు త్వరగా దీనిని ఎలా పోగొట్టుకోవాలో తెలుసుకోండి.

చేతులకి ఉన్న మెహందీ త్వరగా పోవాలా, కొన్ని టిప్స్ ఫాలో అయితే చాలు

క్షణాల్లో గోరింటాకు తాలుకూ మచ్చలు మొత్తం మాయం

మెహందీ చేతులకి అందంగా కనిపిస్తుంది. అయితే, మెహందీ పెట్టిన వెంటనే బానే ఉంటుంది. కానీ, కొన్నిసార్లు దానిని వెంటనే తీసేయాల్సి ఉంటుంది. ఎందుకంటే, కొన్ని ఆఫీసులు, స్కూల్స్, కాలేజీలకి మెహందీ ఉంటే పర్మిషన్ ఉండదు. అంతేకాకుండా, కొద్దిగా ఫేడ్ ఔట్ అయిన మెహందీ కూడా అందరికీ ఇష్టం ఉండదు. దీంతో మెహందీని పోగొట్టుకోవాలనుకుంటారు. దానికోసం ఏం చేయాలని ఆలోచిస్తున్నారా.. కొన్ని ట్రిక్స్ ఫాలో అవ్వండి.

బేకింగ్ సోడా

బేకింగ్ సోడా ఎక్స్ఫోలియేటింగ్ గుణాలు కలిగిన పదార్థం. అరకప్పు నిమ్మరసంలో 2 నుంచి 3 టీస్పూన్ల బేకింగ్ సోడా వేయండి. చక్కగా పేస్టులా చేయండి. దీనిని మెహందీపై ఉంచండి. 15 నిమిషాల పాటు అలానే ఉంచండి. తర్వాత దీనిని స్క్రబ్ చేస్తూ రబ్ చేయండి. తర్వాత గోరువెచ్చని నీటితో కడగండి. దీంతో మెహందీ మరకలన్నీ పోతాయి. ఇదంతా అయ్యాక చేతులకి మాయిశ్చరైజర్ రాయడం మరువొద్దు. లేదంటే చేతులు డ్రైగా మారతాయి.

ఉప్పు నీరు

ఉప్పు నీరు కూడా మెహందీని ఈజీగా పోగొడుతుంది. దీనికోసం బకెట్ గోరువెచ్చని నీటిలో 5 టీ స్పూన్ల ఉప్పువేయాలి. అందులో చేతులని ఉంచాలి. చేతుల్ని మార్చి మార్చి అందులో ఉంచాలి. కాళ్లకి ఉంటే కాళ్లని కూడా పెట్టొచ్చు. 20 నిమిషాల తర్వాత బయటికి తీసి రబ్ చేయాలి. చాలా వరకూ మెహందీ పోతుంది. తర్వాత మాయిశ్చరైజర్ రాయాలి.

షుగర్ స్క్రబ్, కొబ్బరినూనె

పంచదారలో కొద్దిగా కొబ్బరినూనెని కలపండి. దీనిని బాగా మిక్స్ చేసి చేతులకి రాయండి. దీనికోసం 2 టేబుల్ స్పూన్ల పంచదారలో 1 టీ స్పూన్ కొబ్బరినూనె కలపి రాయండి. ఇది చక్కని స్కిన్ ఎక్స్ఫోలియేటర్ అని చెప్పొచ్చు. ఈ మిశ్రమాన్ని చేతులు, పాదాలకి రాయండి. మెల్లిగా మసాజ్ చేయండి. మెహందీ ఉన్నచోట ఎక్కువగా రాయండి. తర్వాత చేతుల్ని గోరువెచ్చని నీటితో కడిగి క్రీమ్ బేస్డ్ మాయిశ్చరైజర్, బాడీ ఆయిల్ రాయండి.

టమాట రసం

టమటరసంలో సిట్రిక్ యాసిడ్ ఉంటుంది. ఇది నేచురల్ ఎక్స్ఫోలియెంట్లా పనిచేస్తుంది. హెన్నా డైని బ్రేక్ చేయడానికి హెల్ప్ చేస్తుంది. బాగా పండిన టమాట నుండి రసం తీయండి. దీనిని మెహందీ ఉన్న చోట రాయండి. ఆ తర్వాత కొన్ని చుక్కల నిమ్మరసం కూడా వేయండి. రెండు చేతులతో దీనిని బాగా రుద్దండి. మెహందీ మొత్తం పోయేవరకూ దీనిని రిపీట్ చేయండి. చేతులని కడిగి ఆ తర్వాత మాయిశ్చరైజర్ రాయండి.

హెయిర్ కండీషనర్

హెయిర్ కండీషనర్లో కొద్దిగా కెమికల్ గుణాలు ఉంటాయి. ఇవి హెన్నా కలర్ని తగ్గిస్తాయి. దీనికోసం కొద్దిగా హెయిర్ కండీషనర్ తీసుకుని చేతులకి రాయాలి. తర్వాత రబ్ చేయాలి. 15 నిమిషాల పాటు ఉంచి తర్వాత నీటితో కడగాలి. చివర్లో మాయిశ్చరైజర్ రాయాలి.



గమనిక:ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి.